ప్రజాశక్తి
ఆదివారం 6 జులై 2025 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా







షరా మామూలే..!

- తెంపల్లిలో మట్టి తవ్వకాలు
- కన్నెత్తి చూడని అధికారులు

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం తెంపల్లి తుమ్మల చెరువులో అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డే లేకుండా పోతుంది. మైనర్ ఇరిగేషన్ అనుమతులు లేకుండానే తవ్వకాలు చేస్తున్నారు. నెల రోజులుగా ఈ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అక్రమ సంపాదనకు రుచి మరిగిన వ్యక్తులు ప్రొక్లెయిన్, ట్రాక్టర్లతో మట్టి తవ్వి ఇటుక బట్టీలకు, కంపెనీలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శిస్తున్నారు. చెరువు మట్టి కాసుల వర్షం కురిపిస్తుండటంతో రైతులు అడిగినా పారేడు మట్టి వేయడం లేదని చెబుతున్నారు. రెండు రోజుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు నిరాటంకంగా జరిగిపోతున్నాయి. చెరువులో పెద్ద గోతులు పెట్టి ప్రొక్లెయిన్ పెట్టి మట్టి తవ్వేస్తున్నారు. రబ్బీసును కంపెనీలకు తరలిస్తున్నారు. ఈ తవ్వకాలకు అనుమతులు లేవని మైనర్ ఇరిగేషన్ అధికారులు చెబుతున్నా మట్టి యదేచ్ఛగా తరలిపోతుంటే చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడు. వర్షం పడినప్పుడు తవ్వకం ఆపుతున్నారు ఎండ వస్తే మళ్లీ మొదలు పెడుతున్నారు. శాఖాపరమైన అనుమతులు లేవు. అదేమంటే ఎమ్మెల్యే పేరును అడ్డం పెట్టుకుని ఈ దందాకు పాల్పడుతున్నారని గ్రామానికి చెందిన రైతులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. లక్షల విలువైన నల్ల బంగారం ఇప్పటికే అక్రమార్కుల పాలైంది. అందులోనూ అధికార గ్రామ పార్టీ నాయకుల పాత్ర ఉందని, అందుకే అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని గ్రామ రైతు నాయకులు చెబుతున్నారు. దీంతో అక్రమార్కులు మట్టిని అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారు. ఇప్పటికైనా ఈ మట్టి దొంగలపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ఈ అక్రమ తవ్వకాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి గ్రామ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



మ్యాజిక్ డ్రైన్స్‌తో మురుగు సమస్యకు పరిష్కారం

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ

ప్రజాశక్తి-నందిగామ

భూగర్భ జలాల పెంపు, మురుగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన 'మ్యాజిక్ డ్రెయిన్' డ్రైనేజీ వ్యవస్థలో గేమ్ ఛేంజర్‌గా మారనున్నాయని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. భూగర్భ జలాల పెంపు మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద నందిగామ మండలం సోమవరం గ్రామంలో చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణాన్ని శనివారం జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంచాలన్న లక్ష్యంతో పాటు మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు మ్యాజిక్ విధానాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. పారిశుధ్యం, భూగర్భ జలాల పునరుద్ధరణ మెరుగుపరుస్తూ మురుగునీటి దుర్వాసన, దోమల వ్యాప్తిని అరికట్టడం మ్యాజిక్ డ్రెయిన్ ప్రాజెక్ట్ లక్ష్యమన్నారు. సాంప్రదాయ కాంక్రీట్ ఛానల్ (సిసి) డ్రైనేజీ వ్యవస్థల మాదిరిగా కాకుండా నూతన పద్ధతయిన మ్యాజిక్ డ్రెయిన్ ద్వారా గృహాల నుండి విడుదలయ్యే మురుగునీరు ప్రత్యేకంగా రూపొందించిన కందకం ద్వారా నేరుగా భూమిలోకి చొచ్చుకుపోయే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో సరైన డ్రైనేజీ సదుపాయాలు లేక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఈ వ్యవస్థ దోహదపడుతుందని తద్వారా ప్రజారోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఖర్చుతో కూడుకున్న కాంక్రీట్ డ్రైన్ల నిర్మాణానికి ప్రత్యామ్నాయంగా మ్యాజిక్ డ్రెయిన్లు ఏర్పాటు చేస్తున్నట్లు (మిగతా 2లో)



విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

చెవిలో పువ్వు... ఖాళీ ప్లేటు...

11వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

వార్త 8లో

ఆదిత్య ఫార్మసీ ఎమ్‌డి నరసింహరాజు ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులే కారణమంటూ లేఖ

... వార్త మెయిన్‌లో

లోక్ అదాలత్‌లో 10,385 కేసులు పరిష్కారం

... వార్త 7లో

వేతనాలు పెంచాల్సిందే

సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద రాజధాని పారిశుధ్య కార్మికుల ఆందోళన

వార్త మెయిన్‌లో



సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు, కార్మికులు

స్వర్ణాంధ్ర సాకారానికి దార్శనిక ప్రణాళికలు

- వనరులు, బలాలు, సవాళ్లు ఆధారంగా రూపకల్పన
- 2047 నాటికి రూ. 18.23 లక్షల కోట్ల జిడిపి లక్ష్యం
- ఎన్‌టిఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రి సత్యకుమార్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-విజయవాడ

స్వర్ణాంధ్ర సాకారం లక్ష్యంలో భాగంగా అందుబాటులో ఉన్న వనరులు, బలాలు, సవాళ్ల ఆధారంగా ఎన్‌టిఆర్ జిల్లా, నియోజకవర్గాల వారీగా దార్శనిక కార్యాచరణ ప్రణాళికల ముసాయిదాలను తయారు చేశామని, 2047 నాటికి రూ.18.23 లక్షల కోట్ల జీడీడీపీని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ఎన్‌టిఆర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, జిల్లా దార్శనిక కార్యాచరణ ప్రణాళిక యూనిట్ ఛైర్మన్ సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన జిల్లా, నియోజకవర్గ దార్శనిక ప్రణాళికలు, స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్‌పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం జరిగింది. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), గద్దె రామ్మోహన్, కొలికపూడి శ్రీనివాసరావు, బోండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్, కేడీసీసీ ఛైర్మన్ నెట్టెం రఘురామ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు. జిల్లా ప్రణాళికపై కలెక్టర్ లక్ష్మీశ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగా ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ప్రణాళికలను నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధికి అవకాశమున్న అంశాలు, కీలక ప్రగతి సూచికలు, పర్యాటక రంగ అభివృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పీవోలు), వ్యవసాయ యాంత్రీకరణ తదితరాలపై చర్చించి, ప్రణాళికల్లో చేర్చాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎన్‌టిఆర్ జిల్లాలో సగటున 18.5 శాతం వార్షిక వృద్ధి సాధనకు కార్యాచరణపై సూచనలు చేశారు. అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గాల స్థూల ఉత్పత్తి, విలువ జోడింపులను పెంచడం ద్వారా జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. క్వాంటం వ్యాలీ అనుబంధ కార్యకలాపాలతో పాటు ఆధ్యాత్మిక, ఎకో, నదీ పర్యాటకంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అనుసంధానం చేసుకుంటూ, సద్వినియోగం చేసుకుని లక్ష్యాల సాధనకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

పేదరిక నిర్మూలనలో రెడ్‌క్రాస్ భాగం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 విధానాన్ని అమలుచేసే విషయంలో రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ పూర్తిస్థాయిలో కార్యాచరణతో చేయి అందించాలని రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ సూచించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా నూతన కమిటీతో జిల్లా కలెక్టర్ శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని ఆయన చాంబర్లో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఇప్పటివరకు చేస్తున్న సేవలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అంశాల గురించి ఈ సమావేశంలో చర్చించారు. కమిటీ చైర్మన్ డాక్టర్ జి.సమరం, వైస్ చైర్మన్ డా. వెలగా జోషి హాజరైన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో పీ4 విధానాన్ని అమలు



చేస్తుందని, దీనిలో రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ పూర్తిస్థాయిలో భాగస్వామ్యం అవ్వాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 65 వేల కుటుంబాలు పేదరికంలో ఉన్నట్లు గుర్తించామని, వారందరినీ ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవ్వాలని కోరారు. రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ పేదరిక నిర్మూలనలో పూర్తిగా భాగస్వామ్యం అయ్యి,పేదరికంలో ఉన్న పేదలను కొంతమందిని దత్తత తీసుకోవడం, వారికి కావలిసిన మౌలిక సదుపాయాలు కల్పించడం ,వారిని స్వయం పోషకులుగా తీర్చిదిద్దటానికి కావలసిన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడం చేయాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లాలో పేదరిక నిర్మూలన కోసం గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారు ఇచ్చిన పిలుపును పురస్కరించుకొని చాలామంది దాతలు ముందుకు వస్తున్నారని, పేదరిక నిర్మూలనలో సహాయ సహకారాలు అందిస్తున్నారని కలెక్టర్ వివరించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ చైర్మన్ డాక్టర్ జి.సమరం మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో పూర్తిస్థాయిలో తాము భాగస్వామ్యం అవుతామని, తమకు కొన్ని కుటుంబాలను కేటాయిస్తే వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి కావలసిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో గుర్తించిన పేదరికంలో ఉన్న వారి జాబితాలు తమకు అందజేస్తే,వారిలో కొంతమంది బాధ్యతను తాము స్వీకరించి వారిని పేదరికం నుంచి విముక్తి కలిగే దిశగా కార్యచరణ ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ సెక్రటరీ చిట్టిబాబు ఇతర సభ్యులు పాల్గొన్నారు.



సిసి కెమెరాలతో పారిశుధ్యం పర్యవేక్షణ

ప్రజాశక్తి-విజయవాడ: సీసీ కెమెరాలతో నగరపాలక సంస్థ ఆస్తుల పారిశుధ్య నిర్వహణ పర్యవేక్షించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ ఎం అన్నారు. శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా గవర్నర్పేట, సివిఆర్ కాంప్లెక్స్, సివిఆర్ స్కూల్, పబ్లిక్ టాయిలెట్, బీసెంట్ రోడ్, అన్సారీ పార్క్, గోవిందరాజులు మార్కెట్, విహెచ్ఆర్ కాంప్లెక్స్, మహంతి మార్కెట్, ఐ వి ప్యాలెస్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరపాలక సంస్థ ఆస్తులన్నిటిలో సీసీ కెమెరాలు అమర్చి పారిశుధ్య నిర్వహణ అధికారులు పరిశీలించాలని అన్నారు, భవనాలన్నిటికీను స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్ ఇంజనీర్లు తీసుకురావాలని, పాత బిల్డింగ్ ల నివేదిక సమర్పించాలని దానికనుగుణంగా వాటి స్థానంలో నగరపాలక సంస్థకు ఆదాయం కలిగించే విధంగా ప్రణాళికను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థకు సంబంధించిన ఆస్తులను పరిశుభ్రంగా ఉండాలని, కర్మలభవనాలు, కళ్యాణ మండపాలు, ప్రజలకు రెంట్ కు ఇచ్చేటప్పుడు వారికి పరిశుభ్రంగా అందించాలని, అందుకోసం పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఎస్టేట్ అధికారులు నగరపాలక సంస్థకు వచ్చే నెల వారి ఆదాయం కచ్చితంగా వసూలు చేయాలని, అందుకు రెవెన్యూ ఇన్స్పెక్టర్లు ఫీల్డ్ లో తిరిగి డిమాండ్ కి తగ్గట్టుగా ఆదాయం వసూలు చేయాలని అన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే ప్రభుదాస్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె అర్జున్ రావు, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి-విజయవాడ: ప్రపంచ జునోసిస్ దినం సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ, పశుసంవర్ధక శాఖ, ఎన్టీఆర్ జిల్లా, జీవకారుణ్య సంస్థ, భవానీపురం, సాయి బాబా సత్సంగ సేవ సమితి మరియు నవోదయ వేట్ సొసైటీ సంయుక్త నిర్వహణలో కుక్కలకు టీకాలు వేయనున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటరు, కెబియ న్ కాలేజ్ దగ్గర ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, భవానీపురం ఐరన్ యార్డులోని జీవకారుణ్యం ఆశ్రమం, ఐరన్ కాంప్లెక్స్ వద్ద ఉదయము 9 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేలా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను ఈ నెల 10న జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని, ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల్లో కూడా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌పై కలెక్టర్ లక్ష్మీశ శనివారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య హాల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,500 పాఠశాలల నుండి రెండు లక్షల మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి హాజరుకానున్నారని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కూడా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 186 జూనియర్ కళాశాలల్లో 78,162 మంది విద్యార్థులున్నట్లు తెలిపారు. పిల్లలే ఆహ్వానాలను తల్లిదండ్రులకు అందిస్తారని, ఆహ్వానంతో పాటు ఒక ఫార్మాట్ ను కూడా ఇస్తారని, తల్లిదండ్రులు ఆ ఫార్మాట్‌పై వారి అభిప్రాయాన్ని రాసి ఇస్తారని పేర్కొన్నారు. పండగలా నిర్వహించే ఈ కార్యక్రమాలలో పాఠశాల అభివద్ధికి కావలసిన మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల చదువు, భవిష్యత్తు, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరుగుతుందని, టీచర్, స్టూడెంట్, పేరెంట్స్ తో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థి గతేడాది చూపిన ప్రతిభను, ఈ ఏడాది సాధించవలసిన దాని గురించి చర్చ జరుగుతుందన్నారు. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీసే విధంగా పలు పోటీలను నిర్వహించడం జరుగుతుందని, అలాగే తల్లిదండ్రులకు కూడా రంగోలి, టగ్ అఫ్ వార్ , సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను కూడా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి బి.ప్రభాకర్, సమగ్ర శిక్ష అధికారి జి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌టిఐహెచ్‌లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ), కంపెనీ సెక్రటరీ (సీఎస్)గా పనిచేసేందుకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5.30 గంటల్లోగా కొటేషన్లను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని.. పోస్టు ద్వారాగానీ లేదా నేరుగాగానీ కార్యాలయ పనివేళల్లో జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో సమర్పించవచ్చన్నారు. కాంట్రాక్టు పీరియడ్ ప్రాథమికంగా ఏడాది ఉంటుందని.. ఈ కాలాన్ని పొడిగించే అవకాశముందన్నారు.కనీసం మూడేళ్ల అనుభవం, అకౌంటింగ్ సిస్టమ్స్, టూల్స్ ప్రొఫిషయన్సీ, రెగ్యులేటరీ ఫైలింగ్, గవర్నెన్స్ పాలసీలు, స్టాట్యుటరీ డాక్యుమెంటేషన్ తదితర అంశాలపై పరిజ్ఞానం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని జేసీ తెలిపారు.

బిఎల్‌ఒలకు శిక్షణ విజయవంతం

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నూతన ఓటర్ల జాబితా తయారీలో బూత్ లెవెల్ అధికారుల పాత్ర కీలకమైనదిగా భావించి విధుల నిర్వహించాలని విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజక వర్గ ఎన్నికల సహాయక అధికారి ఎం.సూర్యారావు అన్నారు. శనివారం మునిసిపల్ కమిషనర్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 264 మంది బూత్ లెవెల్ అధికారులకు ఈ నెల 11వ తేదీ వరకు ఓటర్ల జాబితా తయారీ, మార్పులు, చేర్పులు, మరణించినవారు, వలస వెళ్లిన వారి ఓటర్లను పరిశీలించి తుది సమాచారం అందించడంతో బూత్ లెవెల్ అధికారులు కీలక పాత్ర పోషించే విధంగా శిక్షణనివ్వాలని మాస్టర్ ట్రైనీలకు సూచించారు. మరణించిన, శాశ్వతముగా చిరునామా మారిన ఓటర్లు, ఎన్ఆర్ఐ ఓటర్ల వివరాలను తప్పకుండా సేకరించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా నవీకరించు సమయములో ప్రజలతో మర్యాదపూర్వకముగా ప్రవర్తించాలన్నారు.



మొదటిపేజీ తరువాయి

మ్యాజిక్ డ్రైన్లతో మురుగు సమస్యకు పరిష్కారం

ఆయన తెలిపారు. గృహాల నుండి వినియోగించిన వ్యర్థాలు ఔట్‌లెట్‌ల నుండి వచ్చే మురుగునీరు బహిరంగ ప్రదేశాలలో ప్రవహించకుండా మ్యాజిక్ డ్రెయిన్ పొరల కందకంలోకి చొచ్చుకుపోయి భూగర్భంలోకి కలిసి సహజంగా వడపోత ద్వారా భూగర్భ జలాలను పెంచేందుకు దోహదపడుతుందన్నారు. ఒక మీటర్ సిసి డ్రెయిన్ నిర్మాణానికి దాదాపు రూ.4 వేలు ఖర్చు అవుతుందని, అదే మీటర్‌కు మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణానికి వెయ్యి రూపాయల ఖర్చుతో పూర్తి చేయవచ్చునన్నారు. పైలెట్ ప్రాజక్టుగా చేపట్టిన నమూనా విజయవంతమైతే జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.రాము, ఏపీడి కె.శ్రీనివాసరావు, ఏపివో ఎ.శరత్‌బాబు, ఎంపిడివో కె.శ్రీనివాసరావు, తహశీల్దార్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

మునగ సాగుతో రైతుకు ఆర్థిక బాసట

ప్రస్తుత పరిస్థితుల్లో మునగ సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని, ఈ నేపథ్యంలో అన్నదాతలు ఉపాధి హామీ చట్టం సహాయంతో మునగ సాగు చేపట్టి, ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. సోమవారం గ్రామంలో ఓ రైతు పొలంలో కలెక్టర్ మునగ విత్తనాలు నాటి రెండు వరుసల్లో మునగ పంట పెంపకం పద్ధతికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మునగ సాగును ప్రధాన పంటగా, పొలం గట్ల వెంబడి చుట్టూ అంతర పంటగా చేపట్టవచ్చని తెలిపారు. ప్రత్తి, మిరప, మొక్కజొన్న, కూరగాయలు పండించే రైతులు వారి పొలం చుట్టూ రెండు వరుసల్లో ఎకరానికి 190 మొక్కలు నాటితే ఉపాధి హామీ చట్టం నుంచి రెండేళ్లకు రూ.31 వేల ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఎకరంలో మునగను ప్రధాన పంటగా సాగుచేస్తే 448 మొక్కలకు రూ.94,275 ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ కె.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
ఆదివారం 6 జూలై 2025

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



కంకిపాడు మండలంలో మాట్లాడుతున్న ఎం.హరిబాబు

ప్రజాశక్తి-కంకిపాడు : కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు అన్నారు. శనివారం స్థానిక మండెపూడి భవన్‌లో కౌలు రైతు సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ దేశం మొత్తం కరోనా కష్టకాలంలో ప్రజలంతా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బిక్కిబిక్కుమంటూ గడుపుతున్న కాలంలో కేంద్రంలోని పాలకులు పార్లమెంట్లో నామమాత్ర చర్చ కూడా లేకుండా ఈ లేబర్ కోడ్‌లను అమలు చేయటానికి పూనుకుందన్నారు. వీటిని అడ్డుకోవడానికి దేశవ్యాప్త ఉద్యమం అవసరం అన్నారు. రైతులు ఏడాదికపైగా చేసిన పోరాటంతో కేంద్రం ఏ విధంగా వెనక్కి తగ్గిందో అదే తరహా ఉద్యమంగా ఉద్యోగస్తులు, కార్మికులు, కర్షకులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు అందరూ ఐక్యంగా సమ్మెలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు టి నరేష్, రైతు సంఘం నాయకులు వి శివశంకర్, సిహెచ్ శ్రీహరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి జాన్ మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు : ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి కోరారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు లో ఈ సందర్భంగా సిఐటియు అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజన పథకం ల ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్లో సార్వత్రిక సమ్మెను విజయ వంతం చేయాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ ధనశ్రీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ ల గా మారుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తొలుత చందన లక్ష్మి అధ్యక్షతన సిఐటియు మండల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొడాలి అమ్మాజీ, జయలక్ష్మి, విజయలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, మధ్యాహ్న భోజనం పథకం నాయకురాలు రమాదేవి, పంచాయతీ నాయకురాలు మౌనిక పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోడూరు : దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కోడూరు మండలం ఇన్చార్జి కార్యదర్శి యక్కటి తాతారావుకు శనివారం సిఐటియు జిల్లా కార్యదర్శి మర్రపు పోలి నాయుడు కోడూరు పంచాయతీ సిబ్బంది ప్రజా సంఘాల నాయకులతో కలిసి సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పోలాబత్తిన మోహన్ రావు, మత్స్య కార్మిక సంఘం నాయకులు కోపనాతి తాతయ్య, మోహనకష్ణ, నాని, లక్ష్మీ, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఘంటసాల మండలంలో...

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ఈ నెల 9 న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని కోరుతూ మచిలీపట్నం మండలంలోని పోతేపల్లి గ్రామంలో సీఐటీయూ ఆద్వర్యంలో శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటీయూ నాయకులు బూర సుబ్రహ్మణ్యం,సి హెచ్ జయరావు మాట్లాడారు.

ప్రజాశక్తి-ఘంటసాల : ఈనెల 9వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఘంటసాల మండల కమిటీ ఆధ్వర్యంలో ఘంటసాల గోటకంలో గల కమ్యూనిటీ హాల్ నందు సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు, గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్లు జుజ్జువరపు శ్రీదేవి, కే సుశీల, డి నాగరాణి, డి సుధారాణి ,ఏ నాగ సుధారాణి, అంగన్వాడి హెల్పర్ వి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెకు మద్దతు తెలిపి,కార్మికులు కర్షకులు విరివిగా పాల్గొనాలని కౌల్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే శివ నాగేంద్రం అన్నారు. శనివారం తోట్ల వల్లూరు గ్రామంలో జుజ్జువరపు యోసేపు, కే కొండలు బాబు, డేవిడ్ రాజు తదితర నాయకులు తో కలిసి సమ్మెకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. సమ్మెలో పాల్గొని కార్మికులు కర్షకులు తమ హక్కులను సాధించుకోవాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రజాశక్తి-గన్నవరం : తెంపల్లి గ్రామానికి చెందిన షేక్ బాషా (30) టీవీఎస్ మోటార్ సైకిల్ పై వీరపనేని గూడెం నుండి వస్తున్న ప్పుడు ఎదురుగా వస్తున్న లారీని తప్పించ బోయి అదుపుతప్పి పక్కకు పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే చనిపోయిన ట్లు ఆత్కూర్ ఎస్సై సురేష్ శనివారం తెలిపారు. మృతుడికి వివాహం కాలేదు. మృతుని సోదరులు షేక్ సలాం ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పెట్రోల్ బంక్‌లో నగదు అపహరణ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని చాగంటిపాడు పెట్రోల్ బంక్ లో పెట్రోల్ బాయ్ ని బురిడీ కొట్టించి రూ. 28 వేల తో గుర్తుతెలియని దుండగులు హడాయించిన ఘటన చోటు చేసుకుంది. శనివారం తెల్లవారుజామున 4:10 నిమిషాలకు కరకట్ట వెంబడి ఉన్న చాగంటిపాడు పెట్రోల్ బంక్ లోనికి కారులో నలుగురు వ్యక్తులు వచ్చి 25 లీటర్ల పెట్రోలు కొట్టించుకున్నారు. దీనికి రూ. 2470 అయ్యింది.దీనికి తోడు ఇంకో రూ. 25వేలు ఇవ్వమని ఫోన్ పే చేస్తామని పెట్రోల్ బాయ్ వి. వెంకట రమణ ని అడిగారు. తాము హాస్పిటల్ కు వెళుతున్నామని, చాలా అవసరం ఉందని, డబ్బు ఇచ్చినందుకు రూ. 500 కమిషన్ ఇస్తామని నమ్మబాలికారు. దీంతో రమణ వారికిరూ. 25 వేలు ఇచ్చి ఫోన్ పే చేయమని నెంబర్ చెప్పాడు. ఫోన్ పే నంబర్లో వి. వి. రమణ అని పేరు వచ్చిందని డబ్బు పంపించామని అక్కడనుండి వేగంగా వెళ్లిపోయారు. ఎంతసేపటికి మెసేజ్ రాకపోవడంతో కారువెనుక తోట్లవల్లూరు వరకు వెళ్లిన కనిపించలేదు. దీంతో తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పెట్రోల్ బంక్ లోనే సీసీటీవీలో నమోదైన దశ్యాల్లో కారుకు నెంబర్ కూడా లేదు.

పశుగ్రాస వారోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో పశు పోషకులు పశుగ్రాసాల సాగుపై అవగాహన పెంచుకొవాలని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ సూచించారు. జులై 7 నుండి 14 వరకు, పశుగ్రాస వారోత్సవాలు జరుగుతున్న సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఆద్వర్యంలో ముద్రించిన గోడ పత్రికను శనివారం కలక్టరేట్ సమావేశ హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ పాడి పశువుల పెంపకంలో పోషణ అనేది చాలా కీలకమైన పాత్ర పోషిస్తుందన్నారు. పచ్చి మేతకు కొదవ లేకుండా మేపినప్పుడే రైతుకు పోషణ వ్యయం తగ్గి, పాడి పరిశ్రమ గిట్టుబాటు అవుతుందన్నారు. ఈ పవు వారోత్సవాలపై ప్రతి గ్రామంలోని పశుపోషకులకు పశుగ్రాసం సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించి రాయితీపై పశుగ్రాస విత్తనాలు సరఫరా చేస్తామన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా. ఎన్. సి హెచ్. నరసింహులు మాట్లాడుతూ 75 శాతం రాయితీపై అందించే పశుగ్రాస విత్తనాలను సద్వినియోగం చేసుకొని, పచ్చిమేతను పాడి పశువులకు ,జీవాలకు అందించి అధిక ప్రయోజనాలను పొందాలని తెలిపారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - గుడివాడ : మద్యం తాగి వాహనాలు నడిపే పదిమంది వ్యక్తులకు లక్ష రూపాయల అపరాధ రుసుము విధించి నట్లు రూరల్ ఎస్ఐ చంటిబాబు తెలిపారు. శనివారం తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ రూరల్ మండల పరిధిలో వివిధ వాహనలు నడిపే పదిమంది మద్యం తాగి వాహనదారులకు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

జవహర్‌కు అభినందనలు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రఎస్సీ కమిషన్ చైర్మన్ కె జవహర్‌ను మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఉప పర్యవేక్షణ అధికారి, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి భాను మూర్తి శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు

కలెక్టర్‌కు సత్కారం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఐఏఎస్ గా శుక్రవారానికి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ ఆనంద్ కుమార్ నేతత్వంలో జిల్లా యంత్రాంగం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ ఐఏఎస్ గా పదవీ బాధ్యతలు చేపట్టిననాటి నుండి ఇప్పటివరకు పేద ప్రజల పట్ల చూపుతున్న దయాగుణం, వారికి సహాయం చేయాలన్న తపన, ఏ అంశంలో అయినా ఉద్యోగులు సులభంగా ఎలా విధులు నిర్వహించాలో విశదీకరణ, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని విద్యార్థులకు ఇచ్చే ప్రేరణ తదితరాలపై జిల్లా కలెక్టర్ ను అభినందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఐఏఎస్ గా



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

చేసిన ప్రజా సేవలపై రూపొందించిన ఏవి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ డాక్టర్ జే అరుణ, డి ఆర్ డి ఏ పిడి హరిహరనాథ్, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు, డీఎంహెచ్వో డాక్టర్ శర్మిష్ఠ , డిఐసి జిఎం ఆర్ వెంకటరావు, పౌరసరఫరాల సంస్థ డీఎం శివరాం ప్రసాద్, ఉపాధి కల్పనాధికారి విక్టర్ బాబు, అధికారులు పాల్గొన్నారు.



వంశీని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని తేలప్రోలు గహంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పేర్ని నాని, మాజీ మంత్రి కొడాలి నాని శనివారం కలిశారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసు కున్నారు. అనంతరం ముగ్గురు కాసేపు కూర్చుని పలు విషయాలు మాట్లాడుకున్నారు. రాజకీయ పరిస్థితులపై కాసేపు చర్చించుకున్నారు.

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ మంచి నైపుణ్యం కలిగి ఉండాలని యునైటెడ్ ఫోరం కన్వీనర్ సాల్మన్‌రాజు అన్నారు. శనివారం మండలంలోని గురజాడ గ్రామంలో సామాజిక కార్యకర్త జంపాల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవార్డులను బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రతిఒక్కరు కష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజులపాటి తదితరులు పాల్గొన్నారు.ఇటీవల పదవీవిరమణ చేసిన చొరగుడి కార్యదర్శి తాళ్లూరి వెంకటరమణను ఘనంగా సన్మానించారు. పమిడిముక్కల మండలంలో ఎక్కువ కాలం చేసినందుకు అభినందించారు.

ఆధునిక సాంకేతిక విజ్ఞానంపై జాతీయ సెమినార్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆధునిక మిషన్ లెర్నింగ్ సాంకేతికతలు ఏఐ టూల్స్ హాండ్స్ ఆన్ అనుభవం అనే అంశంపై జాతీయస్థాయి సెమినార్ నిర్వహించారు. శనివారం కళాశాల మన టీవీ భవనంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన డాక్టర్ ఆదిలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్,(ఏఐ) మే షన్(ఎమ్ ఎల్) వంటి ఆధునిక సాంకేతికత అంశాలపై విద్యార్థులకు సమాచారాన్ని అందించారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ శాఖ అధిపతి అధ్యాపకులు ఎం రామారావు, కళాశాల సిబ్బంది సమర్థవంతంగా ఈ సెమినార్ నిర్వహించారు.



పోలీస్ స్టేషన్‌లో సంతకాలు చేసిన వంశీ, కొడాలి నాని

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ శనివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. వివిధ కేసుల్లో నింది తుడుగా ఉన్న ఆయన ఇటీవల బెయిల్‌పై విడుదల య్యారు. కోర్టు ఆదేశాల మేరకు ప్రతి శనివారం పోలీస్ స్టేషన్లో సంతకం చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా ఆయన గన్నవరం పోలీస్ స్టేషన్‌కు వచ్చి రికార్డులో సంతకం చేశారు. అభిమానులు ఆయనను కలిసి ఆప్యా యంగా పలకరించారు. అనంతరం ఆత్కూరు పోలీస్ స్టేషన్ కు, జంక్షన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ కూడా రికార్డులో సంతకాలు చేశారు.

1టౌన్ పోలీస్ స్టేషన్‌కు హాజరైన కొడాలి నాని

ప్రజాశక్తి - గుడివాడ : ఓ కేసుకు సంబంధించి ముందస్తు బెయిల్‌లో భాగంగా కోర్టు షరుతుల మేరకు 1టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంతకాలు చేసేందుకు శనివారం మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) హాజరయ్యారు. పార్టీ శ్రేణులు, అభిమానులు ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకొని కొడాలి నానితో సెల్ఫీలు దిగారు.

నేడు కుక్కలకు ఉచిత టీకాలు

ప్రజాశక్తి-గన్నవరం : ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకొని కుక్కలకు ఉచితంగా రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు పశువుల ఆసుపత్రులలో ఉదయం 9 గంటల నుండి వేస్తున్నట్లు బాపులపాడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం ప్రమీలారాణి తెలియజేశారు. పెంపుడు కుక్కల యజమా నులు ఈ అవకాశాన్ని వినియోగించుకోమని కోరారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : గొల్లపాలెంగట్టు కొండ ప్రాంతంలో సుమారు రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నట్లు సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు జెండా చెట్టు కొండ ప్రాంతంలో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, కార్పొరేషన్ అధికారులతో పాటు డివిజన్ కార్పొరేటర్ సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 సంవత్సరం నుంచి 50వ డివిజన్ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలు ఎక్కువగా నివసించే గొల్లపాలెంగట్టు కొండప్రాంత వాసులు ఏ కార్యక్రమాన్ని జరుపుకోవాలన్న ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విఎంసి అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.రవిశంకర్, సిపిఎం నేతలు జి.నాగరాజు, దుర్గారావు, వై.పైడియా, లంకే చిన్న, సరగడ దుర్గారావు స్థానిక మహిళలు నూకాలమ్మ, దగ్గర రాజేశ్వరి, ఎస్.సుజాత తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలకు వేదిక 'భారత్'

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : భారతదేశం వర్తమాన కాలంలో వినూత్న ఆలోచనలకు అనువైన వేదికగా మారిందని, కానీ పెట్టుబడుల కొరత, మార్కెట్‌లో పోటీ, నైపుణ్యాల లోపం వంటి అనేక సవాళ్లు యువ వ్యవస్థాపకులను వెనక్కి తీస్తున్నాయని ఎపిహెచ్ఆర్ ఇసి ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రొఫెసర్ డి.సూర్యచంద్రరావు అన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసిఎస్-ఎస్ఆర్) స్టేట్ రిసోర్స్ సెంటర్ (ఎస్ఆర్‌సి) స్పాన్సర్‌షిప్‌లో కె.బి.ఎన్ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రసంగ సదస్సు శనివారం సుసంపన్నంగా ముగిసింది. భారతదేశంలో వినూత్న వ్యవస్థాపకులు ఎదుర్కొంటున్న సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సూర్యచంద్రరావు మాట్లాడుతూ జాతీయ ఆర్థికాభివృద్ధి సాధించడంలో యువ పారిశ్రామికవేత్తల పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా పలువురు యువ ఎంట్రప్రెన్యూర్‌లు పరిశ్రమల ఏర్పాటు, నిర్వహణలో తమ విజయాలు, పరాజయాల నుంచి నేర్చుకున్న అనుభవాలను వివరించారు. కెబిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్స్ పి.ఎల్.రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పి.జి కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేష్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ డి.ఎల్.ప్రత్యూష, సెమినార్ కో కన్వీనర్ ఎన్.హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌కు స్పందన

ప్రజాశక్తి- నందిగామ : నందిగామలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌కు మంచి స్పందన లభించింది. నందిగామ 16వ అదనపు న్యాయస్థానం జిల్లా జడ్జి పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 238 సివిల్, క్రిమినల్, ఎక్సైజ్ , మోటార్ వగైరా కేసులు పరిష్కరించి బాధితులకు 2 కోట్ల 60 లక్షల రూపాయలు నష్టపరిహారం చెక్కులు, నగదు అందజేశారు. నందిగామ 16వ అదనపు న్యాయస్థానం నందు జిల్లా జడ్జి పి శ్రీనివాసరావు 35 సివిల్ , క్రిమినల్ ,ఎక్సైజ్ మోటారు వగైరా కేసులు పరిష్కరించి కోటి 90 లక్షల రూపాయలు బాధితులకు పంపిణీ చేశారు. నందిగామ సబ్ కోర్ట్ నందు 7 కేసులు పరిష్కరించి 7 లక్షల 50 వేల రూపాయలు నందిగామ సబ్జెక్ట్ జి.వి.సత్య లక్ష్మీప్రసన్న బాధితులకు అందజేశారు. పిడి ఎం కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ ఆధ్వర్యంలో 64 కేసులు పరిష్కరించి 69 వేల రూపాయలు బాధితులకు నష్టపరిహారం అందజేశారు. అడిషనల్ కోర్టులో 132 కేసులు పరిష్కరించి రూ.62.44 లక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



రామరాజ్యనగర్ 42 ప్లాట్ల బాధితులకు అండగా సిపిఎం


బాధితులకు మద్దతు తెలుపుతున్న సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : పశ్చిమంలోని రామరాజ్యం నగర్ పరిధిలోని ఏకలవ్య నగర్ కరెంట్ ఆఫీస్ వద్ద 24 ఏళ్లుగా నివాసముంటున్న 42 మంది గృహస్తులను తప్పుడు డాక్యుమెంట్లతో ల్యాండ్ మాఫియా కోర్టు లిటిగేషన్స్ చూపుతూ సుమారు రెండు ఎకరాల 17 సెంట్ల స్థలాన్ని హస్తగతం చేసుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని సిపిఎం ఫ్లోర్ లీడర్ పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు ధ్వజమెత్తారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ గత మూడు రోజులుగా ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబాల దీక్షా శిబిరాన్ని సందర్శించి సిపిఎం పశ్చిమ నగర్ కమిటీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా బోయి సత్యబాబుకు 42 మంది గృహ యజమానులు తమ ఇళ్లను బుల్డోజర్‌తో కూల్చి వేస్తామని బెదిరిస్తున్న ల్యాండ్ మాఫియాను కట్టడి చేయాలని బినామీ సొసైటీపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ అండదండలతో జరిగిన ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి ప్లాట్ దారులకు గృహస్తులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సందర్భంగా సత్యబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్లాట్ యజమానులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ బృందంలో సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సూరిబాబు, నగర కమిటీ సభ్యులు ఎమ్‌డి మస్తాన్, కె.వెంకటరత్నం, ఎ.శ్రీనివాస్, ఎస్‌కె రఫీ, ఎ.ప్రదీప్ బాధితులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియలో జాప్యం

పిడిఎస్‌ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్

విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో విద్యాసంవత్సరం ప్రారంభమై, జూన్ నెల ముగిసినప్పటికీ డిగ్రీ అడ్మిషన్స్ నోటిఫికేషన్ గురించి ఎలాంటి సమాచారం లేదని, ఈ ఆలస్యమెందుకు అని పిడిఎస్‌ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ అన్నారు. కోవిడ్‌కు ముందు మే నెలలో అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభమై, జూన్ నెలలోపు పూర్తయ్యేదని, కోవిడ్-19 మహమ్మారి ఉధృతంగా ఉన్న సమయంలో ఈ ప్రక్రియ గందరగోళంగా సాగిన విషయం అందరికీ తెలిసిందేనని తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. అనేక రాష్ట్రాలు విద్యాసంవత్సరాన్ని సర్దుబాటు చేసి, అడ్మిషన్లను సకాలంలో నిర్వహిస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఈ సమస్య ఇంకా కొనసాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 1250 డిగ్రీ కళాశాలల్లో 4.50లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆలస్యంగా జరుగుతున్న అడ్మిషన్ల కారణంగా గత సంవత్సరం 1.80 లక్షల సీట్లు మాత్రమే ఫిల్ అయ్యాయని తెలిపారు. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ముందస్తుగా విద్యార్థులను తమ వద్దకు ఆకర్షిస్తున్నాయని పేర్కొన్నారు. అడ్మిషన్ల ఆలస్యం వల్ల పరీక్షలు, వాటి ఫలితాలు ఆలస్యమవడం, ఎపిపిజిసిఇటి, ఐ సెట్ వంటి ఉమ్మడి పరీక్షలు వాయిదా పడటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమర్థవంతమైన అడ్మిషన్ విధానాన్ని అమలు చేయాలని పిడిఎస్‌ఒ డిమాండ్ చేస్తోందన్నారు.

మంచినీటి ట్యాంకర్ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామానికి చెందిన వంక రాములు ఇటీవల మరణించారు. శనివారం ఆయన దశదిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజగోపాల్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో మంచినీటి సౌకర్యాన్ని పెంచడానికి ఏర్పాటుచేసిన ట్యాంకర్‌ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రారంభించారు. ఈ ట్యాంకర్‌ను గ్రామానికి చెందిన వంక రాములు జ్ఞాపకార్థంగా, వారి కుమారుడు వంక ఏసుబాబు గ్రామ ప్రజల ఉపయోగార్థం బహుకరించారు.

పాఠశాల ఆటస్థలం అభివృద్ధి

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు శ్రీ స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఆటస్థలం అభివృద్ధి పనులు జరిగాయి. గతంలో ఆటస్థలం పిల్లల ఆటపాటలకు అనుకూలంగా లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు నక్కా బాబురావు సొంత డబ్బులను వెచ్చించి దగ్గర ఉండి పనులు నిర్వహించారు.

భూములకు సాగునీరివ్వాలి



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : వేదాద్రి ఎత్తిపోతల పథకానికి వెంటనే నిధులు కేటాయించి మరమ్మతులు చేసి భూములకు వెంటనే సాగునీరందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని డివిఆర్ నగర్‌లో గల సిపిఎం కార్యాలయంలో శనివారం కోట కృష్ణ అధ్యక్షతన సిపిఎం జగ్గయ్యపేట మండల కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎన్‌సిహచ్.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు రోజులుగా రైతులు ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించాలని లేనిపక్షంలో ఆందోళనకి సన్నద్ధమవుతామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్ నాగమణి, నాయకులు షేక్ గౌస్ మియా, పాల్గొన్నారు.

కట్టలేరు వంతెన నిర్మించాలని ధర్నా



ఆందోళన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గంపలగూడెం : గంపలగూడెం కట్టలేరు వంతెనను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ గంపలగూడెం మండల సిపిఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నా జరిగింది. మండల పార్టీ కార్యదర్శి మద్దిరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడుతూ, 2018 సంవత్సరంలో దెబ్బతిన్న ఈ వంతెనను ఇప్పటివరకు నిర్మాణం చేపట్టనందున 20 గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. గడిచిన ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తామని సాక్షాత్తు అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రకటించినప్పటికీ ఫలితం శూన్యమన్నారు. ఎన్నికల్లో గెలిస్తే వెంటనే నిర్మాణం చేపడతామన్న కూటమి ప్రభుత్వం కూడా సంవత్సరకాలం పూర్తయిన పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. నిత్యం విద్యార్థులు, వ్యవసాయ కూలీలు, వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలకు ఈ రహదారి అత్యంత ప్రధానమని, దీనిపై హై లెవెల్ బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పోలీసులు అడ్డుకునే ప్రయత్నం : పార్టీ నాయకులు జండాలు పూని పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్న సమయంలో స్థానిక ఎస్సై ఎస్.శ్రీనివాస్ తన సిబ్బందితో వచ్చి ధర్నా కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ నాయకులు కార్యకర్తలు తీవ్రంగా ప్రకటించి, దాదాపు గంటసేపు ధర్నాను కొనసాగించారు. ఈ సమయంలో కట్టలేరుకు రెండు వైపులా స్కూల్, ఆర్టీసీ బస్సులు, లారీలు ఇతర వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల రాజేంద్రప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు గువ్వల సీతారామిరెడ్డి, సీనియర్ నాయకులు చెరుకు వీరారెడ్డి,పాలెం ఆనందరావు, ఆమ్మిరెడ్డి, మండల కమిటీ సభ్యులు దేశాల గోపాలకృష్ణ, బండి వీరబాబు, జానపాటి వెంకటేశ్వరరావు, మల్లవరపు కుటుంబరావు, గుంటుపల్లి వీరభద్రం, నందిగామ జనార్ధనా చారి, నాళ్ళ సత్యంబాబు, తదితరులు పాల్గొన్నారు.


సుశీలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

సుశీలకు నివాళి

ప్రజాశక్తి - విస్సన్నపేట : సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్, విస్సన్నపేట సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి మేకల జ్ఞాన రత్నం తల్లి మేకల సుశీల (84) మృతికి పలువురు సంతాపం తెలిపారు. విజయవాడ ఆస్పత్రిలో ఆమె శుక్రవారం మృతిచెందగా ఆమెకు సంతాపం తెలిపారు. ఆమె మృతదేహానికి నివాళులర్పించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు, విసన్న పేట మాజీ సర్పంచ్ పల్లెపాం లక్ష్మయ్య, సిపిఎం సభ్యులు ధనలక్ష్మి గెద్దల రామకృష్ణ షేక్ బాజీ సిఐటియు విసన్నపేట మండల అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు విస్సన్నపేట గ్రామ ప్రముఖులు వివిధ రాజకీయ నాయకులు మేకల జ్ఞానరత్నంకు సానుభూతి తెలిపారు.

93 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్లో వివిధ కేసులకు సంబంధించి 93 కేసులు పరిష్కారం అయ్యాయి. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ఇన్చార్జి జడ్జి ఓ.అనూష మాట్లాడుతూ రాజీ పడటానికి అవకాశం ఉన్న సివిల్ క్రిమినల్ మనోవర్తి చెక్కు బౌన్స్ కేసులు రాజీచేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల పరిధిలోని అన్నేరావుపేట గ్రామ పంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ అవగాహన ర్యాలీ అన్నేరావుపేట ప్రధాన వీధుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షులు దగాని వేణు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న మద్దతును, పెరిగిన వేతనాలు, మౌలిక సదుపాయాలను వివరించారు. ఈ పథకం ద్వారా నిరుపేదలు, నిరుద్యోగులు మరి ముఖ్యంగా నైపుణ్యం లేని వయోజనులందరికీ బతుకు దెరువును చూపిస్తుందని తెలిపారు. పలువురు మహిళలు, యువత, ఉపాధి పనివారు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ బాణవతు ప్రశాంతి, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - తిరువూరు : ఏ.కొండూరు మండల విద్యాశాఖాధికారి ఈల ప్రోలు కేశవరావు శనివారం మండలంలోని కోడూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులు 83 మంది ఉండటంపై ఆయన ఉపాధ్యాయులను అభినందించారు. మనబడి మన భవిష్యత్ పథకం ద్వారా 5 తరగతి గదులు, సౌకర్యవంతమైన బల్లలు, ఆర్. ఓ సిస్టమ్ ఏర్పాటు చేయగా దాతలు కంప్యూటర్ ప్రింటర్‌ను బహూకరించినట్లు ప్రధానోపాధ్యాయులు రాంప్రదీప్ ఎంఈవో వివరించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్‌లో భాగంగా ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్, బూట్లు, బెల్ట్, మూడు జతల యూనిఫా మ్ అందచేశామన్నారు. డొక్కా సీతమ్మ మధ్యా హ్న బడి భోజనాన్ని ఆయన రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : ప్రతిభ గల విద్యార్థులను స్వచ్ఛంద సేవా సంస్థలు ఆదుకోవాలని మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు అన్నారు.శనివారం మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రాజుపేట ఉర్దూ పాఠశాల, అంబారి అగ్రహారం స్పెషల్ ఎలిమెంటరీ పాఠశాల, భాస్కరపురం ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు ,కేకులు అందజేశారు. మచిలీపట్నం మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, ఎల్ఐసి యూనియన్ నాయకులు జి కిషోర్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి హసింబేగ్, సంస్థ కో చైర్మన్, కార్పొరేటర్ చిత్తజల్లు నాగ, సంస్థ కన్వీనర్ ముదిగొండ శాస్త్రి, ఆసుపత్రి అభివద్ధి కమిటీ మాజీ డైరెక్టర్ అజీమ్, మాగంటి శిరీష, సంస్థ జాయింట్ సెక్రెటరీ పివి ఫణి కుమార్, కే రాఘవేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిల్ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామని అన్నారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు.

కెయులో స్మార్ట్ క్లాస్ రూమ్స్ ప్రారంభం



ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం అవసరమని కృష్ణా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ పేర్కొన్నారు. హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ సౌజన్యం తో ఏర్పాటుచేసిన స్మార్ట్ క్లాస్ రూమ్స్‌ను హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ ఆంధ్ర ప్రదేశ్ రీజినల్ హెడ్ పవన్ కుమార్ తో కలిసి శనివారం ఉపకులపతి ఆచార్య కె రాంజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ టీవీ ఏర్పాటు చేయడం ద్వారా తరగతి గదులు మరింత స్మార్ట్ గా మారడం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పవన్ కుమార్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమం లో భాగంగా మూడు లక్షల ఇరవై ఐదు వేల రూపాయలు వ్యయంతో మూడు స్మార్ట్ టీవీ లను విశ్వవిద్యాలయం కు బహుకరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, కంప్యూటర్ సైన్స్ డీన్ ఆచార్య వైకే సుందర కష్ణ, సహాయ ఆచార్యులు డా కిరణ్ కుమార్, డా శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని శనివారం రాష్ట్ర హైకోర్ట్ జడ్జి కె .శ్రీనివాస రెడ్డి కుటుంబ సమేతముగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన హైకోర్ట్ జడ్జి కి దేవస్థానం ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు, వేద పండితులు, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది పూర్ణకుంభం తో స్వాగతం పలికారు. ముందుగా శ్రీనివాస రెడ్డి నాగ పుట్టలో పాలు పోసి మొక్కుబడ్లు చెల్లించు కున్నారు . అనంతరం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వేద పండితులు, దేవస్థానం ముఖ్య కార్యనిర్వహణ అధికారి హైకోర్ట్ జడ్జి కె .శ్రీనివాస రెడ్డికి పట్టు వస్త్రాలు తోపాటు శ్రీ స్వామి వారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేశారు.

పాలఉత్పత్తిదారుల అభివృద్ధికి కృషి : చలసాని



ప్రజాశక్తి-గన్నవరం : పాడి పరిశ్రమలో నూతన పద్ధతులను పాటిస్తే పాల ఉత్పత్తి పెరుగుతుందని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలి పారు. బాపులపాడు మండలం కాకులపాడు గ్రామంలో పాల ఉత్పత్తి దారులు సమావేశం శనివారం జరిగింది. ఆంజనేయలు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పాలకు మంచి రేటు ఇవ్వడంతో పాటు బోనస్ కూడా అందిస్తున్నామని చెప్పారు. అనేక నూతన పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చి పాడి రైతు కుటుంబాలకు చేయూత అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కాకులపాడు గ్రామ అబివృవద్ధి తన కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకులపాడు సంఘం పాల ఉత్పత్తి దారులు, గ్రామస్తులు, మహిళలు, కష్ణామిల్క్ యూనియన్ సిబ్బంది పాల్గొన్నారు

బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ చేసుకోవాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈనెల పదవ తేదీన రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ విద్యార్థిని విద్యార్థులు మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు తల్లికి వందనం పథకం నిధులు విద్యార్థుల ఖాతాల్లో జమ చేయనున్నందున విద్యార్థులు తమ బ్యాంకు ఎకౌంటు కు ఆధార్ నెంబర్ను(ఎన్.పి.ఐ) లింకు చేసుకోవాలని ఎస్‌డబ్ల్యూఓ ఎండి పర్వీన్ సుల్తానా తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు బ్యాంకు ఎకౌంటు ప్రారంభించని వారు, బ్యాంకు ఎకౌంటు కు ఆధార్ లింక్ చేయనివారు వెంటనే తమ బ్యాంకు ఎకౌంటుకు ఆధార్ లింక్ చేసుకోవాలన్నారు. ఆధార్ లింకు కానీ ఎకౌంటులకు తల్లికి వందనం నిధులు జమ కావని ఏ ఎస్ డబ్ల్యూ ఓ తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ వెనిగండ్ల రాము

పేదరికం లేని సమాజమే పి4 లక్ష్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గుడివాడ : పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సిఎం చంద్రబాబు పి4ను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక పురపాలక సంఘు కార్యాలయంలోని సమావేశ మందిరంలో గుడివాడ నియోజకవర్గంలో పి4 అమలుపై అధికారు లతో ఎమ్మెల్యే రాము సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి-4 కార్యక్రమం కేవలం దాతత్వ కార్యక్రమమే కాదని, గ్రామాలు స్వయం సమద్ధిని సాధించి, స్వయంగా ఇతర గ్రామాలకు సహాయపడే శాశ్వత సామాజిక ఉద్యమంగా భావించాలన్నారు. ఈ సమావేశంలో గుడివాడ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహులు, ఆర్డిఓ బాలసుబ్రమణ్యం, కమిషనర్ మనోహర్, ఎంపీడీవోలు విష్ణుప్రసాద్, ఎండి ఇమ్రాన్, మల్లీశ్వరి, స్టాటిస్టికల్ ఆఫీసర్లు ఆనంద్‌కుమార్, దీప్తి, పలువురు అధికారులు పాల్గొన్నారు.



దాత ఉమాదేవిని సన్మానిస్తున్న ఆలయ ఈవో

వెండి నక్షత్ర హారతి బహూకరణ

ప్రజాశక్తి - పామర్రు : మండల పరిధి వంద్రపూడి పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయ దేవస్థానంకు విజయవాడకు చెందిన ఉప్పలపాటి ఉమాదేవి స్వామివారికి ఎనిమిది వందల అరవై ఐదు గ్రాముల వెండి నక్షత్ర హారతి కానుకగా సమర్పించారు. దీని విలువ లక్ష రూపాయలు ఉంటుందని ఆలయ కార్య నిర్వహణ అధికారి పివీఎన్ వి. ప్రసాద్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సన్మానించింది. ఈ కార్యక్రమంలో మట్టా వెంకటేశ్వరరావు,తాడిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-గన్నవరం : జాతీయ క్షయ వ్యాధి నివారణ శత దినోత్సవం లో భాగంగా శనివారం గన్నవరం సబ్ జైల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముస్తాబాద్ వైద్యాధికారి డాక్టర్ హర్ష ఖైదీలకు క్షయ వ్యాధి, ఇతర మత్తు పదార్థాల వల్లగలిగే నష్టాలను తెలిపారు. క్షయ వ్యాధి రెండు లేక మూడు వారములు పొడి దగ్గు శరీర బరువు కోల్పోవడం గొంతు నుండి కఫం రావటం మెడ చుట్టూ దద్దుర్లు జ్వరముతో కూడిన నీరసం ఉంటే ఇవి క్షయ వ్యాధి లక్షణములని చెప్పారు. క్షయ వ్యాధి మనిషి వెంట్రుకలు గోళ్ళకు తప్ప శరీరంలో ఏ భాగంలోనైనా క్షయ వ్యాధి రావచ్చని చెప్పారు. క్షయ వ్యాధి కఫము ద్వారా పరీక్ష నిర్వహించి ఆరు నెలల పాటు మందులు వాడినట్లయితే పూర్తిగా నయమవుతుందని డాక్టర్ హర్ష తెలిపారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం తరఫున ప్రతినెల ఒక వెయ్యి రూపాయలు ఆరు నెలల పాటు అందజేస్తుందన్నారు. జైలు నుండి బయటకు వెళ్లిన తరువాత డ్రగ్స్ కు, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సబ్ జైలు అధికారి రాంబాబు, అలాగే వైద్య సిబ్బంది సాంబశివరావు, శ్రీనివాసరావు, సీతారామయ్య, రఘు పాల్గొన్నారు

8,9 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-గన్నవరం : ఈనెల 8, 9 తేదీల్లో గన్నవరంలో జరిగే సిపిఐ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు గన్నవరం నియోజకవర్గ సమితి కార్యదర్శి రామచంద్ర జోషి కోరారు. శనివారం గన్నవరం పార్టీ నియోజకవర్గ సమితి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా మహాసభ 8వ తేదీన గన్నవరం మూడు బొమ్మలు సెంటర్లో జరిగే బహిరంగ సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె రామకృష్ణ, జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాల్గొని మాట్లాడుతారని తెలిపారు



కొండలమ్మకు ఆషాడ చీర సమర్పణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమ వరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారికి ఆదివారం జరగబోయే శాఖాంబరి అలంకారానికి చల్లపల్లి మండలం, భోగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన దావు శారద ఆధ్వర్యంలో భక్తసంఘం తరఫున ఆషాఢ సారె ను శనివారం సమర్పించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు . అలాగే ఈ కార్యక్రమానికి రాబోయే యాత్రికులకు తగు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

అన్నక్యాంటీన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పామర్రు : పేదవాడి ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్ల నిర్మాణం ప్రారంభించామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. శనివారం పామర్రులో 61 లక్షల రూపాయలతో వ్యయంతో నిర్మించనున్న అన్నా క్యాంటీన్ భవన నిర్మాణానికి ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడం వల్ల స్థానిక పేదలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కార్యాలయాలలో పని నిమిత్తం వచ్చేవారికి ఐదు రూపాయలకే ఆకలి తీర్చే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, కష్ణా జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీ దాస్ , మండల పార్టీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, కార్యదర్శి ఈడే నాని, మార్కెటింగ్ యాడ్ మాజీ చైర్మన్ మండపాక శంకర్ బాబు, పట్టణ టిడిపి అధ్యక్షుడు పరస సుబ్రహ్మణ్యం, వీరాంజనేయ దేవస్థానం కమిటీ సభ్యుడు ఈడే గంటయ్య, పట్టణ మాజీ కార్యదర్శులు వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వరి నాట్లు వేసిన ఎంఎల్ఎ వర్ల

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా శనివారం గురువింద పల్లి గ్రామంలో వరి నాట్లు వేశారు. ప్రగతి పదంలో పామర్రు నియోజకవర్గం లో భాగంగా శుక్రవారం రాత్రి గురువింద పల్లి గ్రామంలో పల్లెనిద్ర చేసి శనివారం ఉద యాన్నే గ్రామంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనను వివరించారు. అనంతరం రైతులు, కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు.





విద్యార్థులతో ఎంఇఒ

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - కంచికచర్ల : మండలం బత్తినపాడు గ్రామంలో గల మండలం పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఇఒ బి.బాలాజీ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పాఠశాలలో 23 మంది విద్యార్థులకు గానూ అందరూ హాజరయ్యారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో అందరూ విద్యార్థులు పాల్గొన్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ప్రతిరోజూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాల సిబ్బంది మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు.



ఉచిత అంబులెన్స్ సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పరిధిలో గల ఆర్యవైశ్య కుటుంబాల్లో ఉన్న వారికి, ఆరోగ్యరీత్యా అత్యవసర ప్రాణాపాయ పరిస్థితి కలిగినప్పుడు సుదూర ప్రాంతాలకు రవాణా కొరకై "ఉచిత అంబులెన్స్ సర్వీసు" ఏర్పాటు చేయటం సంతోషదాయకం అని నందిగామ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.వి.యల్. నాయుడు అన్నారు. నందిగామ రైతుపేట వాస్తవ్యులు కపిలవాయి మల్లికార్జునరావు - ధనలక్ష్మి కుమారుడు యూకేలో ఉంటున్న కపిలవాయి గంగాధర్ (గంగ) 4 లక్షల రూపాయలు వెచ్చించి, గంగాధర్ స్నేహితులు మాధవ్ కుమార్ బోయపాటి, లత వివాహ వార్షికోత్సవ సందర్భంగా దంపతులను అభినందిస్తూ నందిగామ ఆర్యవైశ్య సంఘానికి సంఘ ప్రముఖుడు పారేపల్లి సాయిబాబుకు ఉచితంగా అంబులెన్స్ ను అందజేశారు. కావలసినవారు 98 490 48 238 నెంబర్‌కు కాల్ చేయాలని అన్నారు. డోనర్స్‌ను సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ వై.వి.యల్ నాయుడు ఇతర ప్రముఖులు అభినందించి శాలువాతో సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం తరపున సి.ఐ ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంబులెన్స్ ప్రధాన ఆర్గనైజర్ పారేపల్లి సాయిబాబు, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ చైర్మన్‌ఏపూరి నాగేశ్వరరావు షేక్ ఖాలిక్,మారంఅమరయ్య, అంబులెన్స్ కో - కన్వీనర్ కందుకూరి మహేష్ కుమార్, అన్నపూర్ణ సేవాసమితి కమిటీ, ఆర్యవైశ్య సంఘం కమిటీ, రిటైర్డ్ ఎస్సై యరగొర్ల రామారావు బలుసుపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తానా సభల్లో 'నేను నా అమరావతి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- నందిగామ : అమెరికాలోని తానా సభల్లో నందిగామ నియోజకవర్గానికి చెందిన బాలయ్య కోటయ్య రచించిన నేను రాసిన నేను - నా అమరావతి పుస్తకం ఆవిష్కరణ జరిగింది. ప్రజా రాజధాని అమరావతి నాకు ఇచ్చిన గొప్ప వరం అని, నా జీవన ప్రయాణంలో నేను రాజధాని ఉద్యమంలో పాల్గొంటానని బాల కోటయ్య తెలిపారు. 1631 రోజుల పాటు రైతులతో కలిసి నడుస్తానని కానీ, రాజధాని ఉద్యమంపై పుస్తకం రాసాను అని కానీ, అలా రాసిన పుస్తకాన్ని అమెరికాలో ఆవిష్కరణ చేస్తానని కానీ ఏనాడూ ఊహించలేదని తెలిపారు. శనివారం తానా సభల్లో తానా ప్రతినిధులు, పలువురు ప్రముఖుల ఆధ్వర్యంలో నేను నా అమరావతి పుస్తక ఆవిష్కరణ చేశారు. పుస్తకావిష్కరణ సభలో చికాగోకు చెందిన యలమంచి ప్రసాద్, కాలిఫోర్నియాకు చెందిన శ్యామ్ అరబింది, తానా మాజీ చైర్మన్ కోమటి జయరాం, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి బివి వెంకటేశ్వరరావు, అప్పసాని రాజేష్, మహాసేన రాజేష్, లక్ష్మి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

9న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆటో, మోటార్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు పిలుపునిచ్చారు. శనివారం లెనిన్ సెంటర్‌లోని లీలా గ్రాండ్ హెూటల్‌లో రైల్వే స్టేషన్ ఆటో కార్మికుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో ఆటో, మోటార్ కార్మికులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆటో,మోటార్ కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆటో, మోటార్ కార్మికుల పోరాటాలకు సి.పి.ఎం పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆటో, మోటార్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం గాలికి వదిలేసి బడా కంపెనీలకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికులు శ్రమకు తగ్గ ఫలితాన్ని అందనీయకుండా చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు, సి.ఐ.టి.యు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.కె దుర్గావళి, రైల్వే స్టేషన్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు డి.కోటయ్య ఎ.వి రెడ్డి ఉన్నారు. **మైలవరం :** మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు కలిసి శనివారం ఎంఇఒ బాలుకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్.సుధాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి.శేషమ్మ, వరలక్ష్మి, సంపతి, పాఠశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. **వీరులపాడు :** లేబర్ కోడ్‌ల రద్దు, ఇతర సమస్యల పరిష్కారానికి సమ్మెలో, పెద్ద ఎత్తున కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.కమల పిలుపునిచ్చారు. జుజ్జూరు గ్రామంలో సిఐటియు కార్యాలయంలో పి.సుబ్బమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమల మాట్లాడారు. సమ్మెలో ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె లాల్ అహ్మద్ గౌస్, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. **విజయవాడ సిటీ :** కొత్తపేట మోటూరు హనుమంతరావు శ్రామిక భవన్‌లో శనివారం సిఐటియు అనుబంధ సంస్థ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ విజయవాడ పశ్చిమ జోన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా జాతీయ సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ విజయవాడ పశ్చిమ నగర కమిటీ అధ్యక్షుడు సిహెచ్ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్.కె జాని, కార్యదర్శి కె.శంకరయ్య, సహాయ కార్యదర్శి ఎస్.సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **కంచికచర్ల :** సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు శనివారం కంచికచర్లలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావుపలు యూనియన్ నాయకులు పాల్గొన్నారు. **చందర్లపాడు :** చందర్లపాడు మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు శనివారం ఉదయం మండల విద్యాశాఖ అధికారి జి.శ్యామ్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో , సిఐటియు మండల కార్యదర్శి వేల్పుల ఏసోబు, మధ్యాహ్నం భోజన కార్మికులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** పట్టణంలోని సిఐటియు ఆధ్వర్యంలో ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కూచిపూడి సుధాకర్, సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్ మియా, నాయకులు తదితరులు పాల్గొన్నారు. **త్సవాయి :** సమ్మెలో పాల్గొంటామని తెలియజేస్తూ వత్సవాయి మెడికల్ ఆఫీసర్ డా.హర్షిదకు, డాక్టర్ సీతారాంకు ఆశ వర్కర్లు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి బి.రాము, ఆశ వర్కర్స్ మేరమ్మ, శైలజా, జ్యోతి వేలాద్రి తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** అంగన్వాడీ కార్యకర్తలతో ఇబ్రహీంపట్నంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సి హెచ్ సుప్రజ కోరారు. మండల కార్యదర్శి యం.మహేష్, మండల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూని యన్ (సిఐటియు) అధ్యక్షురాలు కె.బుల్లిమ్మ, కార్యదర్శి ఎస్.నిర్మల, గుంటుపల్లి సెక్టార్ లీడర్స్ పాల్గొన్నారు. **విస్సన్నపేట :** సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ విస్సన్నపేట బిల్లింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ మున్సిపల్ మేనేజర్ దేవికి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మె నోటీస్ అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సలికేటి నరేష్, కార్యదర్శి దసవరపు సైదా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసనలు

ప్రజాశక్తి - విజయవాడ : స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పెంచిన ట్రూ ఆప్ చార్జీలు తగ్గించాలని అదానీతో చేసుకున్న ఒప్పం దాన్ని విరమించుకోవాలని నెల్లూరు జిల్లా కడేరు గ్రామంలో ఇండోసోల్ కంపెనీకి రైతుల భూములను అప్పగించవద్దంటూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో శనివారం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు అధ్యక్షతన విద్యుత్ చార్జీలు పెంపుపై నిరసన తెలిపారు. ఈ నిరసనకు ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచమని అధికారంలో లేనప్పుడు ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏకంగా రూ.15,400కోట్లు ప్రజలపై భారాన్ని మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా గతంలో పెద్దఎత్తున ప్రచారం చేసి .ఎవరైనా స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే పగలుగొట్టండని పిలుపు ఇచ్చి నేడు వాటిని బిగించుకోమని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. **పెనుగంచిప్రోలు :** విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్సిహెచ్.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెనుగంచిప్రోలులో యరబ్రోలు రామారావు అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ప్రజల ఆదాయాలు తగ్గి కొనుగోలు శక్తి దెబ్బతిన్నదని కూటమి ప్రభుత్వం బిజెపి కేంద్ర ఆదేశాలతో విద్యుత్తు చార్జీలు పెద్ద ఎత్తున వేసి భారాలు మోపుతుందని శ్రీనివాస్ అన్నారు. **జగ్గయ్యపేట :** రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీల పేరుతో పెంచిన విద్యుత్ భారాన్ని తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో డిపో సెంటర్‌లో ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. **నందిగామ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఆంధ్ర ప్రదేశ్ అదాని స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. నందిగామ విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేశారు.

టైలర్లకు పించను ఇవ్వాలి

ప్రజాశక్తి - తిరువూరు : 50 యేళ్ల వయస్సు దాటిన టైలర్లకు ప్రభుత్వం పింఛన్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు జెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తిరు వూరు సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎన్టీఆర్ జిల్లా టైలర్సు యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో టైలర్స్ జనరల్ బాడీ సమావేశం పి.తులసీరాణి అధ్యక్షతన శనివారం జరిగింది. దర్జీలు బట్టలు కుడుతూ చూపు మందగించడంతో వృత్తి చేయలేకపోతున్నారని పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని, కరెంటు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అనంతరం టైలర్సు యూనియన్ తిరువూరు పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కోట శాంత కుమారి, కార్యదర్శిగా ఇంజం రాజేశ్వరి, గౌరవ అధ్య క్షులుగా షేక్ సత్తార్ తో పాటు మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

23వ డివిజన్‌లో 'తొలిఅడుగు'

ప్రజాశక్తి - విజయవాడ : సెంట్రల్ నియోజకవర్గం లోని 23వ డివిజన్ విజయ్ టాకీస్ దగ్గర నక్కల్ రోడ్డు కార్నర్ గోపురామచంద్ర వీధి నుంచి వద్ద ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం చేపట్టిన 'సుపరిపాలనలో - తొలి అడుగు' అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఎమ్మెల్యే బొండా ఉమ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్, టిడిపి ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి ప్రజలకు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ ఏడాది పాలన గురించి ప్రజలకు పథకాలు అమలుపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో: డివిజన్ అధ్యక్షులు చింతా దుర్గారావు,తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌టిసి డిపో కార్మికుల నిరసన

ప్రజాశక్తి - తిరువూరు : ఆర్టీసీ కార్మికుల ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ తిరువూరు డిపోలో కార్మికులు శనివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ రీజనల్ అధ్యక్షుడు ఎస్ రమేష్ మాట్లాడుతూ ఆర్టీసీలో ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, పాత పద్ధతిలోనే వైద్య సదుపాయం కల్పించాలని, కరువుభత్యం బకాయిలు ఇవ్వాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రీజనల్ వైస్ ప్రెసిడెంట్ హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట రామకష్ణ, డిపో కార్యదర్శి పీకే రెడ్డి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవస్థానంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి పర్వదినం రోజు ఆదివారం ఉదయం 9 గంటల నుండి స్వామి, అమ్మవార్ల వస్త్రాల బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఆలయ ఇఒ కానూరి సురేష్ తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొని పాట ముగిసిన వెంటనే పాడిన సొమ్ము చెల్లించి వస్త్రాలు పొందొచ్చని తెలిపారు. దేవస్థానంలో ప్రతిరోజు జరిగే అన్నదానానికి గుంటూరు జిల్లా జొన్నలగడ్డకు చెందిన ఇమడాబత్తుని సురేష్ బాబు, విజయలక్ష్మి రూ.10,116లు నగదు రూపంలో విరాళంగా సమర్పించినట్లు ఇఒ, దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్తు తెలిపారు.

సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో సహకార వ్యవస్థ బలోపేతం కావాలని, సహకార సంస్థలు సమ్మిళితమై స్థిరమైన అభివద్ధి మార్గాలతో మెరుగైన ప్రపంచాన్ని నిర్మించేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని మత్స్యశాఖ సంయుక్త సంచాలకుల కార్యాలయంలో 103 వ అంతర్జాతీయ సహకార దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత కార్యాలయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ మొక్కలు నాటి, సహకార సంఘాల పతాకాన్ని ఎగురవేసి, సహకార గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంపద సష్టి అనే అంశం కేవలం ప్రభుత్వంపైనే కాకుండా సమాజం పైన బాధ్యత ఉందన్నారు. జిల్లాలోని మత్స్యకార సహకార సంఘాలు ఫెడరేషన్ గా ఏర్పడి యూనిట్లు పెట్టుకొని సొంతంగా విక్రయాలు జరిపేందుకు అవసరమైతే ఆప్కాఫ్ రుణాలు గాని, యన్‌సిడిసి రుణాలు అందించే ఏర్పాటు చేస్తామన్నారు. మత్స్యకార సంఘాలు సొంతంగా బ్రాండ్ యూనిట్లు ఏర్పాటు చేసుకుని మత్స్య సంపద ఉత్పత్తులు అమ్మకాలు చేపట్టాలన్నారు. మత్స్యశాఖ సం యుక్త సంచాలకులు ఏ .నాగరాజ, డి సి ఓ చంద్రశేఖర్, జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు నాగ రమేష్, ఆప్కాఫ్ సిబిబివో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పి-4 అమలుకు కృషి చేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి ఫోర్ కార్యక్రమాన్ని నియోజకవర్గ పరిస్థితికి అనుగుణంగా ఆచరణాత్మక అమలుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. శుక్రవారం అవనిగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి సాయిబాబు, ప్రాజెక్ట్ ఏరియా చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంపీపీ లు సుమతి దేవి, కోట విజయ రాధిక, సర్పంచ్ గో రుముచ్చు ఉమా పాల్గొన్నారు

ఆర్‌టిసి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ సమస్యల పరిష్కారం కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు రెండవ రోజు అవనిగడ్డ ఆర్టీసీ డిపో గేట్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిపో అధ్యక్షులు బిఎల్ ప్రసాద్, కార్యదర్శి మహేష్, యూనియన్ నాయకులు బి సురేష్, పివి రంగారావు, కమల, శ్రీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** ప్రభుత్వ పరిధిలోని ఆర్‌టిసి ఉదోగులకు తక్షణమే పదోన్నతులు పి.ఆర్‌సి, డిఏ బకాయిలు చెల్లించాలని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.బాలాజీ, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి రమణ, కె.ఎస్ రావుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సిసిఎస్ డెలిగెట్ సుబ్రహ్మణ్యం, రీజనల్ నాయకులు కె.వాణి, పి.కొండలరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని వినతి



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో జరిగే మెగా పిటిఎంలో విట్నెస్ అధికారిని పాఠశాల హెడ్మాస్టర్ నియమించుకొని వారి చేత వీడియోలు తీయించి అప్లోడ్ చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె ఎ ఉమామహేశ్వరరావు, కృష్ణాజిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి షౌకత్ హుస్సేన్, బి కనకారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖాధికారి పి వి జె రామారావుకు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులతో కలిసి విద్యార్థుల విద్యాభివద్ధి మీద, పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల సదుపాయాల మీద మాట్లాడుకోవటానికి 17 రకాల కమిటీలు, ఫోటోలు, అప్లోడ్లు, విట్నెస్ అధికారి ఇంత అవసరమా? అని అన్నారు. డాక్యుమెంట్రీ కార్యక్రమంగా మార్చడం సరికాదని విద్యార్థుల విద్యాభివద్ధి గురించి చర్చించే కార్యక్రమంగా దాన్ని మార్చాలని కోరారు. పాఠశాలలు ప్రారంభమైన నెల రోజుల లోపే యోగా పేరుతో వారం రోజులు, మెగా పిటిఎం పేరుతో మరో వారం రోజులు బోధన సమయాన్ని హరిస్తుందన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు పాఠశాల సమయంలో ఉపాధ్యాయుల బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు జె లెనిన్ బాబు, జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజా శ్రీధర్, ఆడిట్ కమిటీ సభ్యులు జె ప్రసాదరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పి రవి వరప్రసాద్, పి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను కాపాడాలని వినతి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : నగరపాలక సంస్థ పరిధిలో క్రైస్తవులకు ఏర్పాటు చేసిన శ్మశాన వాటికకు తెలుగుదేశం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తాళం వేసి తన ఆధీనంలో ఉంచుకోవడంపై వైసీపీ కార్పొరేటర్లు శనివారం మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజుకు ఫిర్యాదు చేశారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కనుసన్న లలోనే క్రైస్తవుల శ్మశాన వాటిక నిర్వహణ అధికారం ఉండడంతో దానిని ఆయన గేదెలు పెంచుకోవడానికి ఉపయోగిస్తున్నా పరిస్థితుల్లో క్రైస్తవ సోదరులు అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడు తున్నారన్నారు. శ్మశాన వాటికను తన సొంత అవసరాలకు వాడుకుంటూ, మరణ ధ్రువీకరణ పత్రాలు అందించే పుస్తకాలను కూడా మాజీ కౌన్సిలర్ ఇంట్లో



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పెట్టుకోవడంపై వైసిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కౌన్సిలర్లు మల్కాపట్నం బురగ రామారావు, 30 డివిజన్ రాంప్రసాద్, శారద నగర్ నాంచారయ్య తో పాటు గాడెల్లి డేవిడ్, నోబెల్ థామస్ తదితరులు పాల్గొన్నారు

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : ఆటోనగర్‌లో పనిచేస్తూ ప్రమాదవశాత్తూ గాయపడిని కార్మికుడు షేక్ అబ్దుల్ సమత్ కుటుంబానికి ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.10వేలు అందజేసింది. గుడివాడలోని కార్మిక నగర్ 22వ వార్డు నివాసి అయిన షేక్ అబ్దుల్ సమత్ గుడివాడ ఆటోనగర్లో ఎండి రషీద్ బేగ్ షెడ్‌లో వెల్డర్‌గా పనిచేయుచుండగా ప్రమాదవశాత్తు రేకు తెగి ఎడమచేతి నాలుగువేళ్ళు తెగాయి. ఈ సందర్భంగా ప్రమాదానికి గురైన కార్మికుని కుటుంబానికి యూనియన్ తరపున ఆర్థిక సహాయం అందజేశామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు టి. లక్ష్మణరావు, అధ్యక్షులు అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, నాయకులు బొబ్బర పల్లి ఆంజనేయులు, షేక్ మొహిద్దిన్ భాష పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు నిలుపుదల చేయాలని నిరసన

ప్రజాశక్తి - గుడివాడ : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రజలకు భారంగా ఉన్న స్మార్ట్ మీటర్లను తక్షణమే నిలుపుదల చేయాలని సిపిఐ నియోజవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో సిపిఐ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాష్‌బాబు మాట్లాడుతూ గతంలో ఆదాని స్మార్ట్ మీటర్ల విషయంలో పోరాటం చేసిన చంద్రబాబు నేడు స్మార్టు మీటర్లను ప్రోత్సహిస్తు న్నారన్నారు.

బిఎల్‌ఒలకు శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం : ఎన్నికల నియమ నిబంధనలపై బీఎల్వోలు అవగాహన కల్గి ఉండాలని గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి టి. శివరామ ప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎన్నికల విధి విధానాలపై నియోజకవర్గ స్థాయి మాస్టర్స్ ట్రైనర్లోతో పాటు బీఎల్వోలకు 5 వ తేదీ నుండి 16 వరకు శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీలో బీఎల్ వోల పాత్ర కీలకమైందని చెప్పారు. ఈ నెల 9 నుంచి ఓటర్ జాబితా తయారీ, మార్పులు, చేర్పులు అదే విధంగా మర ణించిన వారు, వలస వెళ్లిన వారి ఓట్లను పరిశీలిం చి తుది సమాచారం అందించే విధంగా శిక్షణ తర గుతులను చేపట్టామని పేర్కొన్నారు. తహసీల్దార్ కట్ట. వెంకట శివయ్య, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ నాంచారమ్మ, ఉంగుటూరు డిప్యూటీ తాసిల్దార్ చిట్టి బాబు పాల్గొన్నారు.



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి గోపి

లోక్ అదాలతో 10,385 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి రవినాథ్ తెలహరి ఆదేశాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ కార్యదర్శుల పర్యవేక్షణలో లోక్ అదాలత్ నిర్వహించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టాల గోపి తెలియజేశారు. మచిలీపట్నం కోర్టు ప్రాంగణంలో ఆరు బెంచుల నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 10385 కేసులు రాజీ మార్గంలో పరిష్కార మైనట్లు ఆయన వివరించారు. **ప్రజాశక్తి - గుడివాడ :** గుడివాడలోని కోర్టులో 3 బెంచ్‌లను ఏర్పాటు చేసి 1,013 కేసులు పరిష్కరించి రూ.4,14,15,153లు కక్షిదారులకు అందజేశారు. శనివారం రాష్ట్ర న్యాయసేవ సంస్థ ఆదేశాల మేరకు 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.గాయత్రిలు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. మొత్తం 1,013 కేసుల్లో సివిల్ కేసులు 15కి గాను రూ.1,15,92,310లు, క్రిమినల్ కేసులు 997కి గాను రూ.2,97,95,221లు, ఇతరాలు 1కేసుకి గాను రూ.27,622లు కేసులలో మొత్తం రూ.4,14,15,153లు కక్షిదారులకు అందజేశారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయలోక్ అదాలత్ నిర్వహించి 156 కేసులు న్యాయమూర్తి కె.శ్రీహరిపరిష్కరించారు. వీటిలో 9 సివిల్, 6 చెక్ బౌన్స్, 68 ఐపీసీ పోలీసు కేసులు, పిటీ కేసులు 73 పరిష్కరించి రూ.38,02,800 అపరాధ రుసుము, రాజీకేసులకు పరిహారంగా చెల్లించేలా చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపీచంద్, సీనియర్ న్యాయవాది చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాధుని రథయాత్ర

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా కేంద్రం మచిలీపట్నంలో శ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్రను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక చాకిరేవుపాలెంలోని శ్రీ జగన్నాథ స్వామి వారి మందిరం నిర్వాహకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథుని రథయాత్ర నగర ప్రధాన వీధుల్లో కన్నుల పండువగా సాగింది. నిజాంపేటలో వేంచేసియున్న శ్రీ బొబ్బిలి వేణుగోపాల స్వామి దేవస్థానంలో ప్రత్యేక ప్రార్థనలు అనంతరం రథయాత్ర ప్రారంభమైంది. గాంధీ బొమ్మ శివాలయం, ఈడేపల్లి శక్తి గుడి, రేవతి సెంటర్, కోనేరుసెంటర్, పోర్ట్ రోడ్డు, బుట్టాయిపేట మీదుగా చాకిరేవుపాలెంలోని జగన్నాథ స్వామి మందిరం వరకు రథయాత్ర సాగింది. రాష్ట్ర గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్వామి వారి రథోత్సవంలో పాల్గొని స్వయంగా రథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కుంచే దుర్గా ప్రసాద్ (నాని), జనసేన నాయకులు కొట్టె వెంకట్రావ్ పాల్గొన్నారు.

పరిశోధనలో విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య భాగస్వామ్యం అవసరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల, లైలా న్యూట్రా ప్రైవేట్ లిమిటెడ్ విజయవాడ వారి అనుసంధానంతో 'ట్రాన్స్ఫార్మింగ్ డ్రగ్ డిస్కవరీ ఫర్ నెక్స్ జెన్ డ్రగ్ డెవలప్మెంట్' అనే అంశంపై వర్క్ షాప్ ను శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, వర్క్ షాప్ కన్వీనర్ డాక్టర్ ఎ లక్ష్మణరావు మాట్లాడుతూ పరిశోధన, అభివద్ధిలో విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య భాగస్వామ్యం ఎంత అవసరమో వివరించారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా డాక్టర్ ఏవీ కష్ణంరాజు, జనరల్ మేనేజర్, ఆర్ అండ్ డి, లైలా న్యూట్రా ప్రైవేట్ లిమిటెడ్ విజయవాడ నుంచి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్. ఫార్ములేషన్ డివిజన్ విభాగాధిపతి డాక్టర్ జి కిషోర్ బాబు, సెల్యులర్ అండ్ మొలిక్యులర్ బయాలజీ విభాగాధిపతి డాక్టర్ కే శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా లైలా న్యూట్రా ప్రైవేట్ లిమిటెడ్. విజయవాడ వారు కళాశాలలో ప్రాంగణ నియామకలను నిర్వహించారు.

అనుమతికి మించి అంతస్తులు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం నగరపాలక సంస్థ 14 డివిజన్ లో అనుమతులు లేకుండా ఆరు అంతస్తుల అపార్ట్మెంట్ తరహా నిర్మాణం పనులు చురుకుగా జరుగు తున్నాయి. మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధి లో 5 అంతస్తుల కు మాత్రమే అనుమతి ఉండగా, 6 అంతస్తులు నిర్మించి ఏడవ అంతస్తుకు సన్నాహాలు చేస్తున్న యాజమాన్య ప్రయత్నాలను అధికారులు అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు. నగరంలో జోరుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ఎటువంటి తనిఖీలు చేయడంలేదని వాపోతున్నారు. ఇటీవల మూడో డివిజన్ తాటాకుల ఇంటిని అక్రమ నిర్మాణం అని కూల్చివేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు లేకుండా చేపడుతున్న బహుళ అంతస్తుల నిర్మాణంపై ఏ చర్యలు తీసుకుంటారో అని ప్రశ్నిస్తు న్నారు. అదేవిధంగా వనజా మెస్ ఎదురుగా ఉన్న అపా ర్ట్మెంట్ సైతం రెండం తస్తులకే అనుమతులు ఉండగా నాలుగు అంతస్తులు నిర్మిస్తు న్నా ఎలాంటి చర్యలు తీసు కోవడంలేదని అంటున్నారు.



ఏడంతస్తుల భవనం

కంచర్ల రామయ్యకు నివాళి



ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రముఖ పాత్రికేయులు, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ కంచర్ల రామయ్య సంస్మరణ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి వెంకట శ్రీనివా సరావు పాల్గొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుప్పం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్య జూన్ 19వ తేదీన మరణించారని, శనివారం కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో రామయ్య సంస్మరణ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాత్రికేయునిగా రామయ్య సేవలను కొనియాడారు.

చెవిలో పూలు... ఖాళీ ప్లేటు...

విజయవాడలో విజయవంతంగా 11వ రోజు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - విజయవాడ : ఇంజినీరింగ్ కార్మికుల 11వ రోజు సమ్మె విజయవంతం అయింది. సమ్మె శిభిరంలో చేతిలో చిప్ప, చెవిలో పువ్వు పెట్టుకొని వందలాది మంది కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్(వాటర్, పార్కు , వెహికల్ డిపో మెకానిక్, స్ట్రీట్ లైటింగ్, టౌన్ ప్లానింగ్ కంప్యూటర్ ఆపరేటర్స్,)కార్మికుల సమ్మె నడుస్తుంది. జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ కార్మికులు చేసిన నినాదాలు హెూరెత్తాయి. ప్రజానాట్యమండలి కళాకారులు పాటలతో నిరసన శిబిరాన్ని ఉషారెత్తించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వం, మునిసిపల్‌శాఖ ఎటువంటి భేషజాలకు పోకుండా తక్షణం యూనియన్ నేతలతో చర్చలు జరిపి, న్యాయబద్దమైన కార్మికుల వేతనాలతో పాటు ఇతర డిమాండ్స్‌ను పరిష్కరించాలని లేనట్లయితే ఈ నెల 12వ తేదీ నుంచి పారిశుధ్య కార్మికులను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సానుకూలంగా పరిష్కరిస్తామని, మంత్రివర్గ ఉప సంఘం, సిడిఎమ్‌ఏ ద్వారా చెప్పిన దరిమిలా రెండు- మూడు రోజులు గడువు ఇస్తున్నామని అన్నారు. మీడియా ద్వారా కాకుండా ప్రత్యక్షంగా యూనియన్ పిలిచి మాట్లాడాలని కోరారు. తాము ఏదో ప్రెస్ మీట్‌లో చెబుతాం, రాష్ట్ర ఆర్థిక మంత్రి, మున్సిపల్ మంత్రి కలిసి చెబుతాం అంటూ మంత్రులు మాట్లాడటం సోచనీయమన్నారు. నేరుగా ప్రత్యక్షంగా చెబితే కార్మికుల అభిప్రాయం నిర్మామాటంగా చెబుతామని అన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా 12 అర్థరాత్రి నుంచి మున్సిపల్ పారిశుధ్య, వెహికల్ డిపో డ్రైవర్లు, క్లీనర్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులు సమ్మెలోకి దిగుతారని హెచ్చరించారు. జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు రూ.15వేలను 21వేలు, రూ.18500 నుండి 24,500 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. నామ్‌కే వాస్తే అన్నట్లు రూ. వేయి పెంచుతాం, 2వేలు పెంచుతాం, 3వేలు పెంచుతాం అంటే పోరుబాట పడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షుడు జ్యోతిబాస్, నగర ఉపాధ్యక్షురాలు టి.తిరుపతమ్మ, మన్నే బుజ్జమ్మ, పార్క్ సెక్షన్ బాధ్యులు టి.చిన్న, వెంకట్రావు, స్వరూప, వెహికల్ డిపో మెకానిక్‌లు, వై.దుర్గాప్రసాద్, సుందరయ్య, రమేష్, వాటర్ సెక్షన్ బాధ్యులు దుర్గారావు, నల్ల శ్రీను, సైదులు, నారాయణ నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్ తదితరులు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి అప్పన్న, రాష్ట్ర నాయకులు జగన్ పాల్గొన్నారు.

తిరువూరు : మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మి కులకు జీవో నెంబర్ 36 ప్రకా రం వేతనాలు చెల్లించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయా లని, ఇంజనీరింగ్ కార్మికులకు వయోపరిమితి 62 సంవత్సరాల పెంచాలని రిటైర్మెంట్ బెనిఫి ట్స్ కల్పించాలని, ప్రమాదం జరిగితే ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని తదిత డిమాండ్లతో తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బలగాని వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ నందిగామ మున్సిపల్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులందరికీ జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు పరిమి రవి అధ్యక్షులు, కార్యదర్శి శ్రావణ్ కుమార్, కోశాధికారి కండెల శీను, సహాయ కార్యదర్శి దారెల్లి అశోక్,దాసు, వంశీ, రవి, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో నిర్వహించిన సమ్మెలో మాట్లాడుతున్న కాశీనాథ్



తిరువూరులో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న కార్మికులు



నందిగామలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు



పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టిబి ఇంటెన్సిఫైడ్ కాంపెయినింగ్ ప్రోగ్రాం పోస్టర్‌ను ఎంపి కేశినేని శివనాథ్ ఆవిష్కరించారు. ఎన్.టి.ఈ.పి.సిబ్బంది గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిశారు. ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో టిబి ఇంటెన్సిఫైడ్ కాంపెయినింగ్ ప్రోగ్రాంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం టీబీ రహిత దేశంగా చేయాలనే సంకల్పంతో ఉచిత చికిత్స అందిస్తుందన్నారు. క్రమం తప్పకుండ టీబీ మందులు వాడితే టీబీని నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.టి.ఈ.పి సిబ్బంది పి.పి.ఎమ్ కో-ఆర్డినేటర్ పి.లీలాకుమార్, టిడి హెల్త్ విజిటర్ ఎమ్.గంగాధర్, పి.పి.ఎస్.ఎ. ఫీల్డ్ కో-ఆర్డినేటర్ కె.సంజయ్ పాల్గొన్నారు.



విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి : శశికాంత్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : మొఘల్రాజపురం లోని వీరమాచనేని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ లో శనివారం విద్యార్థుల పదవీ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా ఎయిమ్స్ మంగళగిరి డిప్యూటీ డైరెక్టర్ (ప్రశాసనం) కల్నల్ శశికాంత్ తుమ్మా హాజరయ్యారు. ఎన్.డి.ఏ పూణే పూర్వ విద్యార్థి అయిన కల్నల్ తుమ్మా పర్వత, ఎత్తు యుద్ధంలో విశాలమైన అనుభవం కలిగి, సేవా పతకాలు, ఆర్మీ కమాండర్ కామండేషన్ కార్డులు అందుకున్న ఘనత వహించారు. స్కూల్ ప్రిన్సిపల్ మేడ సీతారామయ్య అతిధిని స్వాగతించి, ఉప ప్రిన్సిపల్ రోజ్‌మేరీతో కలిసి విద్యార్థి నేతలకు షోల్డర్ పిప్స్, బ్యాడ్జ్‌లు అలంకరించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన కల్నల్ తుమ్మా విద్యార్థులు నాయకత్వ గుణాలు పెంపొందించుకోవాలని, శారీరక దృఢత సాధించాలని సూచించారు.

కల్తీ పత్తి విత్తనాలు కొనుగోలు చేయొద్దు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల వ్యవసాయ అధికారి డి శ్రీనివాసరావు క్షేత్ర పర్యటనలో భాగంగా కునపరాజుపర్వ గ్రామంలో పత్తి రైతులను కలిసి పత్తి విత్తనాలు కొనుగోలు గురించి విచారించారు. రైతులు ఎక్కువగా తులసి రాశి నూజివీడు కంపెనీలకు చెందిన విత్తనాలను సాగు చేస్తున్నామని తెలిపారు. పత్తి పంట జూలై 15 వరకు విత్తుకోవచ్చని, ఈ క్రమంలో రైతు సోదరులు ఎవరూ గ్లైసిల్ పత్తి విత్తనాలు సాగు చేయొద్దని తెలిపారు. ప్రభుత్వ అనుమతి, లైసెన్సు కలిగిన డీలర్ నుండి మాత్రమే ఎరువులు పురుగుమందులు విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఆరేపల్లి పవన్ కుమార్, వ్యవసాయ సహాయకులు కె.దివ్య పాల్గొన్నారు.

ఆఫ్లైన్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ వన్‌టౌన్లోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం, కాకినాడలోని జేఎన్టీయూ కాకినాడ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం యూసిఈకెతో సంయుక్తంగా ఆఫ్లైన్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ఎఫ్‌డిపిను విజయవంతంగా నిర్వహించారు. జూలై ఒకటి నుండి జూలై 5 వరకు జరిగినా క్వాంటం కంప్యూటింగ్, అల్గోరిథం, అప్లికేషన్లు అనే అంశంపై నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా క్వాంటం కంప్యూటింగ్ వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగం, ఫ్యాకల్టీ సభ్యులు, పరిశ్రమ నిపుణుల సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం ఫ్‌డిపి ప్రధాన లక్ష్యం, క్వాంటం కంప్యూటింగ్ క్రిప్టోగ్రఫీ, కృత్రిమ మేధస్సు, అనుకరణ, ఫైనాన్స్, ఇమేజ్ ప్రాసెసింగ్‌లో దాని అనువర్తనాల కారణంగా ఊపందుకుంటుందని ఎన్‌ఐటి (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) వరంగల్ బ్రాంచ్ నుంచి డాక్టర్ యు, ఎస్.ఎస్.రాజు, అన్నారు. ఈ ఎఫ్‌డిపిలో క్వాంటం కంప్యూటింగ్ నిపుణులు క్యూబిట్స్, సూపర్ పొజిషన్, ఎంటాంగిల్ మెంట్, డైరాక్ నొటేషన్, క్వాంటం గేట్స్, సర్క్యూట్లతో పాటు డ్యూచ్-జోజ్సా అల్గోరిథం, బెర్న్‌స్టెయిన్-వజిరానీ అల్గోరిథం, సైమన్ అల్గోరిథం, గ్రోవర్ అల్గోరిథం, షోర్స్ అల్గోరిథం, క్వాంటం ఫోరియర్ ట్రాన్స్ ఫార్మ్, క్వాంటం మెషిన్ లెర్నింగ్, క్వాంటం ఇమేజ్ ప్రాసెసింగ్ వంటి కీలక అల్గోరిథంలను చర్చించారు.



నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి

జాతీయ సదస్సుకు హాజరైన నందిగామ మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - నందిగామ : గురు గ్రామ్, హర్యానా కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో "రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర" అంశంపై సదస్సుకు రాష్ట్రం నుంచి హాజరైన నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి హాజరయ్యారు. ఈ సదస్సు జూలై 3, 4 తేదీల్లో హర్యానాలోని, గురుగ్రామ్‌లో భారత పార్లమెంటు హర్యానా ప్రభుత్వ సహకారంతో దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పట్టణ స్థానిక సంస్థల చైర్మన్ లకు ఈ సదస్సు పై అవగాహన కల్పించడం కోసం రెండు రోజులు జాతీయ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు ఏపీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లను నామినేట్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారికి అవకాశం దక్కింది.



జాతీయస్థాయి సదస్సులో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కృష్ణకుమారి



నిమ్రా ఫార్మసీ కళాశాల విద్యార్థికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఫార్మసీ విభాగంలో ఉత్తీర్ణత సాధించిన దర్శి నర్మద అనే విద్యార్థిని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ చే జేఎన్‌టియు కాకినాడ విశ్వవిద్యాలయంలో గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక సిబ్బంది విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఆర్‌పిల హర్షం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్‌లకు సంబంధించి మూడేళ్ల కాల పరిమితి నిబంధన తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఆర్‌పిలు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్యను కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం చిన్నబాబు, మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్స్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.